సాక్షి సిద్దిపేట

బుధవారం। 5। ఫిబ్రవరి। 2025



ఇదేం రైతు 'శిక్ష'ణ?

దుబ్బాకలోని లచ్చపేటలో రైతు శిక్షణ కేంద్రం ఏళ్లు గడుస్తున్నా అసంపూర్తిగానే దర్శనమిస్తోంది. పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. వివరాలు 8లో ▸



రిటైర్మెంట్ వయసు పెంచొద్దు

ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంచే ఆలోచన విరమించుకోవాలని టీపీటీఎఫ్ నేత తిరుపతిరెడ్డి అన్నారు. వివరాలు 8లో ▸



నట్టల నివారణకు..

పశువుల్లో నట్టల నివారణ మందులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కరువయ్యాయి.

వివరాలు 9లో ▸

న్యూస్‌రీల్

మల్లన్న ఆదాయం రూ.43.28లక్షలు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయానికి పట్నంవారం (మొదటి ఆదివారం) రూ.43,28,742 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు మంగళవారం తెలిపారు. మొత్తం మూడు రోజుల ఆదాయమని చెప్పారు. స్వామివారికి భక్తులు వివిధ రకాల మొక్కులు, దర్శనాలు, లడ్డూ ప్రసాదాల ద్వారా ఈ ఆదాయం సమకూరినట్లు తెలిపారు. గత ఏడాది మూడో వారానికి రూ. 55.70లక్షలు సమకూరగా, ఈసారి రూ.12,41,722 తక్కువగా ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ రామాంజనేయులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్



మాట్లాడుతున్న మల్లికార్జున్

హుస్నాబాద్: కొత్తగా మహిళా సంఘాల ఏర్పాటు, బ్యాంక్ రుణాల పంపిణీ పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఆదేశించారు. మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మెప్మా ఆర్పీలతో సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బ్యాంకుల ద్వారా తీసుకునే రుణాలతో మహిళలు ఆర్థికంగా రాణించాలన్నారు. డబ్బులు వృథా చేయకుండా స్వయం ఉపాధి కోసం వినియోగించుకోవాలన్నారు. బ్యాంకర్లకు మహిళలపై నమ్మకం ఉండేలా రుణాలను కూడా సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో పీడీ హన్మంతరెడ్డి, ఏడీఎంసీ సంతోషి, టీఎంసీ ముత్యాలరాజు, ఆర్పీలు ఉన్నారు.

యూజీడీ లీకేజీలకు మరమ్మతులు



యూజీడీ లీకేజీ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కమిషనర్

సాక్షి ఎఫెక్ట్

గజ్వేల్: 'ముంచెత్తుతున్న మురుగు' శీర్షికన యూజీడీ లీకేజీలపై 'సాక్షి'లో గత నెల 31న ప్రచురితమైన కథనంపై గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ నర్సయ్య స్పందించారు. ఈ మేరకు పట్టణంలోని లక్ష్మీప్రసన్ననగర్ కాలనీలో యూజీడీ లీకేజీలకు మరమ్మతు చేయించారు. మంగళవారం స్వయంగా పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ఇబ్బందుల్లేకుండా చూడటమే తమ కర్తవ్యమని అన్నారు.

ప్లాస్టిక్ రహితమే లక్ష్యం కావాలి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఆశ్రిత్ కుమార్

సిద్దిపేటజోన్: ప్లాస్టిక్ రహిత సిద్దిపేటగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ సూచించారు. మంగళవారం పారిశుద్ధ్య కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. పట్టణంలో ప్లాస్టిక్ వాడకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. స్టీల్ బ్యాంకు సద్వినియోగం చేసుకోవాలని మహిళలకు సూచించాలని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన ప్లాస్టిక్ రహిత వస్తువుల పెళ్లి గురించి వివరించారు.

తీన్మార్ మల్లన్న ఫ్లెక్సీ దహనం



మల్లన్న ఫ్లెక్సీని దహనం చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

సిద్దిపేటజోన్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో రెడ్డి సంఘం నాయకులు నిరసన తెలిపారు. మంగళవారం ముస్తాబాద్ చౌరస్తాలో మల్లన్న ఫ్లెక్సీని దహనం చేశారు. వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మమతారెడ్డి, ఆనంద్‌రెడ్డి, రాజలింగారెడ్డి, నరేందర్ రెడ్డి, రాజిరెడ్డి పాల్గొన్నారు.



స్వామి వారి ఊరేగింపులో భక్తులు

వైభవంగా రథసప్తమి వేడుకలు

జిల్లా కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో మంగళవారం రథసప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణమూర్తిగా స్వామి వారిని పురవీధుల గుండా ఊరేగించారు. వికాస తరంగిణి ఆధ్వర్యంలో భక్తులు కోలాటంతో కనువిందు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్, ఈఓ, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. – ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)



ఓం సూర్య దేవాయ నమః

రథ సప్తమిని పురస్కరించుకుని సామూహిక సూర్యనమస్కారాలు చేపట్టారు. జిల్లా కేంద్రం కోమటిచెరువు నెక్లెస్ రోడ్డులో సూర్య నమస్కారాలతో సూర్యునికి స్వాగతం పలికారు. వ్యాస మహర్షి యోగ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అలాగే సరస్వతి శిశు మందిర్‌లో సామూహికంగా సూర్య నమస్కారాలు చేశారు. – సిద్దిపేటజోన్



కోమటిచెరువు వద్ద సామూహిక సూర్య నమస్కారాలు

కౌన్ బనేగా కమల దళపతి

భారతీయ జనతా పార్టీ(బీజేపీ) జిల్లా సారథి ఎవరనే విషయంపై ఉత్కంఠ కొనసాగుతోంది. ఇటీవల 19 జిల్లాలకు బీజేపీ అధ్యక్షులను ప్రకటించారు. జిల్లా అధ్యక్షుడి నియామకంలో ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పార్టీ హైకమాండ్ పెండింగ్‌లో పెట్టింది. జిల్లా అధ్యక్ష పీఠాన్ని ఐదుగురు ఆశిస్తున్నారు. ఇప్పటికే పార్టీ అధిష్టానం కొత్త అధ్యక్షుని నియామకం కోసం సర్వేలు చేయించినట్లు తెలిసింది. పార్టీ అధిష్టానం ఎవరివైపు మొగ్గుచూపి జిల్లా పీఠం అప్పగిస్తారన్నది తెలియాల్సి ఉంది. – సాక్షి, సిద్దిపేట

పెండింగ్‌లో జిల్లా అధ్యక్షుడి నియామకం

- అధ్యక్ష పదవి రేసులో ఐదుగురు
- ఎవరి ప్రయత్నాలు వారివే
- బీసీలకు ఇవ్వాలని పలువురు నేతల పట్టు



బీజేపీ జిల్లా అధ్యక్ష బాధ్యతలు ఎవరికి అప్పగిస్తారన్నదానిపై సస్పెన్స్ నెలకొంది. ప్రస్తుతం బాధ్యతలు నిర్వహిస్తున్న మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇస్తారా? లేకుంటే కొత్త వారిని ఎంపిక చేస్తారా? అన్నది పార్టీ శ్రేణుల్లో సస్పెన్స్‌గా మారింది. జిల్లా అధ్యక్ష పదవి కోసం ప్రస్తుత అధ్యక్షుడు గంగాడి మోహన్ రెడ్డి, కార్యవర్గ సభ్యుడు అంబటి బాలేష్ గౌడ్(దుబ్బాక), రాష్ట్ర నాయకుడు దారం గురువారెడ్డి(గజ్వేల్), మెదక్ పార్లమెంట్ కో కన్వీనర్ నలగామ శ్రీనివాస్ (గజ్వేల్), జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి శంకర్ ముదిరాజ్ (సిద్దిపేట) నామినేషన్లు వేశారు. 19 జిల్లాల అధ్యక్షులతో పాటు సిద్దిపేట సైతం ప్రకటించాల్సి ఉండగా ఏకాభిప్రాయం కుదరకపోవడంతో పెండింగ్‌లో పెట్టినట్లు తెలిసింది.

ఈ సారి బీసీలకు ఇవ్వాల్సిందే..

ఈ ఐదుగురిలో చివరకు తమలో ఎవరికిచ్చినా పర్వాలేదని అధిష్టానానికి చెప్పినట్లు సమాచారం. వీరు గతంలో కొనసాగిన పదవులు, అనుభవం, పార్టీ కోసం చేసిన కార్యక్రమాలు వివరిస్తూ అధ్యక్షపదవిని దక్కించుకోవాలని ప్రయత్నాలు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాగా ఏర్పాటైనప్పటి నుంచి ఓసీలకే అధ్యక్షపదవిని ఇస్తున్నారు. ఈ సారి బీసీకి ఇవ్వాలని పలువురు గట్టిగా పట్టుపడుతున్నారు. అలాగే జిల్లాకు చెందిన వారికే పదవి ఇవ్వాలని, గతంలో ఇతర జిల్లాకు చెందిన వ్యక్తికి అధ్యక్షపదవి ఇచ్చారని పలువురు అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. పార్టీలో కష్టపడిన వారికి గుర్తించి పదవి ఇవ్వాలని ఆశిస్తున్నవారు కోరుతున్నారు. ఎవరికి వారు గాడ్ ఫాదర్ల ద్వారా ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు. కొందరు సామాజిక సమీకరణాల్లోనూ అవకాశం దక్కేలా యత్నిస్తున్నారు.

భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని..

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో మెదక్ ఎంపీగా రఘునందన్ రావు గెలుపొందేందుకు సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గం కీలక పాత్ర పోషించింది. రానున్నది స్థానిక సంస్థల ఎన్నికలు ఉండటంతో అధిష్టానం ఆచీతూచి వ్యవహరిస్తోంది. ప్రధానంగా దుబ్బాక, గజ్వేల్, హుస్నాబాద్, చేర్యాల మున్సిపాలిటీలతో పాటు జిల్లా, మండల పరిషత్, సర్పంచ్ ఎన్నికలున్నాయి. వీటిలో మెజారిటీ సీట్లు సాధించాలనే లక్ష్యంతో పార్టీ నాయకత్వం ముందుకు వెళ్తోంది. ఈ క్రమంలో ఎవరికి బాధ్యతలు అప్పగిస్తే మెజార్టీ సీట్లు సాధిస్తారని ఆలోచించి నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. రాష్ట్ర అధ్యక్షుని ప్రకటన తర్వాత జిల్లా అధ్యక్షుడిని నియమిస్తారా? ముందే ప్రకటిస్తారా? అని కార్యకర్తలు ఎదురు చూస్తున్నారు. పార్టీని సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లే, అభివృద్ధికి కృషి చేసే నాయకుడిని నియమించాలని పార్టీ కార్యకర్తలు కోరుతున్నారు.

మందులు క్రమపద్ధతిలో భద్రపర్చాలి

డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్



డ్రగ్ స్టోర్‌ను పరిశీలిస్తున్న పల్వన్‌కుమార్

సిద్దిపేటకమాన్: డ్రగ్ స్టోర్‌లో మందుల నిల్వలను క్రమపద్ధతిలో భద్రపర్చాలని డీఎంహెచ్ఓ డాక్టర్ పల్వన్‌కుమార్ తెలిపారు. జిల్లా డ్రగ్ స్టోర్ సెంటర్‌ను డీఎంహెచ్ఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టోర్‌లోని మందులను, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడువుకు దగ్గర ఉన్న మందులపై, వ్యాక్సిన్ నిల్వపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి నెలలో ఒకసారి కచ్చితంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు మందులను పంపించాలని సిబ్బందిని ఆదేశించారు. సిబ్బంది సమయ పాలన పాటించాలని సూచించారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులపై అవగాహన

న్యాయమూర్తి స్వాతిరెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న స్వాతిరెడ్డి

సిద్దిపేటజోన్: బాలల హక్కులు, చట్టాలపై అవగాహన తప్పనిసరి అని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ, న్యాయమూర్తి స్వాతిరెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక బాల సదనం సందర్శించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌తో పాటు న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాతిరెడ్డి మాట్లాడుతూ... లీగల్ ఎయిడ్ క్లినిక్ ద్వారా న్యాయపరమైన సలహాలు, పిల్లలకు సంబంధించిన చట్టాలు గురించి అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అందుకు సంబంధించిన న్యాయవాది, ప్యారా లీగల్ వలంటైర్ ను నియమించారు. ప్రతి బుధవారం బాలసదనం సందర్శించడం జరుగుతుందని, సమస్యలు ఉంటే వారికి తెలుపాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి రాము, బాలసదనం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దైవ చింతనతోనే ప్రశాంతత

మాధవానంద సరస్వతి స్వామిజీ



మాధవానంద సరస్వతి స్వామిజీకి స్వాగతం పలుకుతున్న భక్తులు

దుబ్బాక: నిరంతరం భగవన్నామ స్మరణతోనే మానసిక ప్రశాంతత కలుగుతుందని మాధవానంద సరస్వతి స్వామిజీ అన్నారు. దుబ్బాక పట్టణంలో మహంకాళి ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మ వారికి మాధవానంద సరస్వతి స్వామిజీ ప్రత్యేక పూజలు చేసి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఎన్ని కష్టాలు వచ్చిన ధర్మం తప్పవద్దన్నారు. ఉత్సవాల సందర్భంగా సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు తీర్చుకున్నారు.

అభ్యంతరాలుంటే తెలపండి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్


- అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్
- వివిధ రాజకీయ పార్టీ నేతలతో సమావేశం

సిద్దిపేటరూరల్: జిల్లా వ్యాప్తంగా ఓటర్ జాబితాపై అభ్యంతరాలుంటే తెలపాలని అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ అన్నారు. గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి మంగళవారం కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారితో కలిసి వివిధ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా గత ఏడాది సెప్టెంబర్ 28న రాష్ట్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాను విడుదల చేసిందన్నారు. జిల్లాలోని 17 పంచాయతీల డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను తయారుచేసి ఈనెల 3న గ్రామపంచాయతీ, మండల పరిషత్ కార్యాలయాలలో ప్రదర్శించినట్లు తెలిపారు. సిద్దిపేట రూరల్ మండల పరిధిలోని 15 గ్రామ పంచాయతీలు, కొండపాక, అక్కన్నపేట మండలాల్లో ఒక గ్రామ పంచాయతీ చొప్పున పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి జాబితాను అందిస్తామన్నారు. బుధవారం వరకు అభ్యంతరాలను స్వీకరించి 6న పరిష్కరించి 7న తుది ఓటర్ జాబితాను ప్రచురిస్తామన్నారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటర్లు 71,622

నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ షురూ..

- మార్చి 8 వరకు కోడ్ అమలు
- పెరగనున్న ఓటర్ల సంఖ్య



సంగారెడ్డి జోన్: ఉమ్మడి మెదక్–కరీంనగర్–నిజామాబాద్–ఆదిలాబాద్ జిల్లాలతో కూడిన పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలకు నగారా మోగింది. ఇందుకు సంబంధించి భారత ఎన్నికల సంఘం సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే ఎమ్మెల్సీ ఎన్నికలలో ఓటు వేసేందుకు ఓటరు జాబితాతో పాటు పోలింగ్ కేంద్రాలను గుర్తించి, గతేడాది డిసెంబర్ 30న తుది జాబితాను సిద్ధం చేసిన సంగతి తెలిసిందే.

మార్చి 8 వరకు కోడ్

మండలి ఎన్నికల కోడ్ అమలు మార్చి 8 వరకు అమలు చేయనున్నట్లు ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. కోడ్ ముగిసే వరకు ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల సంఘం నియమ నిబంధనల మేరకే ప్రచారం చేసుకోవాల్సి ఉంటుంది. ఎన్నికలు కొనసాగే జిల్లాల్లో కోడ్ అమల్లో ఉండటంతో కొత్త పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసేందుకు అవకాశం లేదని ఎన్నికల సంఘం ఆదేశాల్లో స్పష్టంగా పేర్కొంది.

ఎన్నికల నిర్వహణకు కసరత్తు

ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు ఆయా శాఖల అధికారులు ఇప్పటికే కసరత్తు ప్రారంభించారు. జిల్లా ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్, ప్రతీ జిల్లాలో ఆర్డీవోలు అసిస్టెంట్ ఎన్నికల అధికారులుగా వ్యవహరిస్తారు. సంగారెడ్డి జిల్లాలో నలుగురు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఉన్నారు. అదేవిధంగా మండలాల వారీగా అధికారులను కేటాయించే పని కొనసాగుతోంది.

కరీంనగర్‌లో నామినేషన్ దాఖలు

పట్టభద్రులు, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసే అభ్యర్థులు కరీంనగర్‌లోని కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారికి నామినేషన్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఎమ్మెల్సీ ఎన్నిక బ్యాలెట్ పేపర్ విధానంలో నిర్వహించనున్నారు.

174 పోలింగ్ స్టేషన్లు

గతేడాది డిసెంబర్ 30న విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో ఉమ్మడి మెదక్ జిల్లావ్యాప్తంగా 71,622 మంది ఉపాధ్యాయ పట్టభద్రుల ఓటర్లు ఉన్నట్లు గుర్తించారు. అదేవిధంగా 174 పోలింగ్ స్టేషన్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ సంవత్సరం జనవరి 1 నుంచి 31 వరకు ఓటు వేసేందుకు మరో అవకాశం కల్పించారు. దీంతో దరఖాస్తు చేసుకున్న వారితో మరింతగా ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. పెరిగిన ఓటర్ల సంఖ్యతోపాటు ఓటర్ల జాబితా ను ఈనెల 7న ప్రకటించనున్నారు.

ఇదీ షెడ్యూల్

ఈ నెల 3న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల కాగా, అదేరోజు నుంచి 10వ తేదీ వరకు నామినేషన్ల దాఖలుకు అవకాశం కల్పించింది. 11న నామినేషన్ పత్రాలు పరిశీలన, 13వ తేదీ వరకు వాటి ఉపసంహరణకు గడువు విధించింది. ఉపసంహరణ అనంతరం పోటీ చేసే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. ఈనెల 27న ఉదయం 8:00 గంటల నుంచి సాయంత్రం 4:00 గంటల వరకు పోలింగ్ నిర్వహించనుంది. మార్చి 3న ఓట్ల లెక్కింపు ప్రక్రియ చేపట్టనుంది.

పట్టభద్రుల ఓటర్లు, పోలింగ్‌స్టేషన్లు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
సంగారెడ్డి	6,765	14,437	21,202	40
మెదక్	3,420	8,533	11,953	22
సిద్దిపేట	10,624	20,922	31,546	40

ఉపాధ్యాయుల ఓటర్లు, పోలింగ్‌స్టేషన్లు

జిల్లా	స్త్రీలు	పురుషులు	మొత్తం	పోలింగ్ స్టేషన్లు
సంగారెడ్డి	1,103	1,485	2,588	28
మెదక్	515	766	1,281	21
సిద్దిపేట	1,104	1,948	3,052	23